క్లుప్తంగా

కల్యాణ మండపం ప్రారంభం



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మండల పరిధిలోని రామేశ్వరం గ్రామంలో గల శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో కీ.శే మంచిరేవుల జంగయ్య, భీమమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంచిరేవుల సాయికృష్ణ, కళమ్మ దంపతులు నిర్మించిన కల్యాణ మండపాన్ని ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. దేవాలయ ప్రాంగణంలో భక్తుల సౌకర్యార్థం కల్యాణ మండపాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనురుధ్‌రెడ్డి, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన, నాయకులు కృష్ణారెడ్డి, రఘునాయక్, శ్రీకాంత్‌రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, పురుషోత్తం, ఆశన్నగౌడ్, చంద్రశేఖర్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

చేవెళ్ల: గ్రామాల్లో ఉండే పేద ప్రజలకు ఉచిత వైద్యశిబిరాలు ఎంతో మేలు చేస్తాయని బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఊర్లేళ్ల గ్రామంలో ఆదివారం వైభవ్‌రెడ్డి సహకారంతో నగరంలోని టీఎక్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ వైద్యశిబిరంలో అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన వైద్య పరీక్షలు చేయటంతో పాటు రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజలు పెద్దసంఖ్యలో ఈ వైద్యశిబిరంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీఎక్స్ ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, బీజేపీ మండల అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కె.శివప్రసాద్, మాజీ సర్పంచ్ నర్సింలు, నాయకులు విఠలయ్య, జహంగీర్, అశోక్, శర్వలింగం, ఎ.శ్రీనివాస్, గ్రామ నాయకులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మైసమ్మ బోనాలు



బోనాల ఊరేగింపులో గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామంలో ఆదివారం నూతనంగా నిర్మించిన రక్తమైసమ్మ దేవాలయంలో అమ్మవారి బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం నుంచే గ్రామస్తులు పూజలు నిర్వహించారు. డప్పుచప్పుళ్ల మధ్య బోనాల ఊరేగింపుతో గ్రామస్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవళీగోపికృష్ణారెడ్డి, విశ్వకర్మ గౌరవ అధ్యక్షుడు నర్సింహ్మాచారి పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



2003 బ్యాచ్ విద్యార్థులతో కళాశాల బృందం

శంకర్‌పల్లి: మండలంలోని దొంతాన్‌పల్లిలో గల ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో 2003లో విద్యనభ్యసించిన విద్యార్థులందరూ శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దీనికి ఇక్ఫాయ్ కళాశాల వేదికైంది. ఈ కార్యక్రమంలో దేశంలోని 15 రాష్ట్రాలతో పాటు అమెరికా, యూకే, సింగపూర్, దుబాయ్ వంటి దేశాల్లో స్థిరపడిన సుమారు 100మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. వారంతా కలిసి కళాశాలలో పాత జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. కళాశాలకు తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని, భవిష్యత్‌లోనూ కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి రిజిస్ట్రార్ విజయలక్ష్మి, ఏఆర్‌సీ డీన్ ప్రొ.జి.కె శ్రీకాంత్, డైరెక్టర్ కే.ఎస్ వేణుగోపాల్‌రావు, జాయింట్ రిజిస్ట్రార్ మధుసూదన్‌రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

‘ఉపాధి’కి ప్రణాళిక ఖరారు

- 2025 ఆర్థిక సంవత్సరంలో 1.15లక్షల పనిదినాలు
- గ్రామాల్లో ప్రారంభమైన పనులు
- వ్యవసాయ పనులకు ప్రాధాన్యత

గ్రామీణ ప్రాంతాల్లో వలసలను నియంత్రించి కూలీలకు వందరోజుల పని కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అమలు చేస్తోంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గానూ మండలంలో చేపట్టాల్సిన పనుల కార్యాచరణ ప్రణాళికను అధికారులు ఖరారు చేశారు. గతంలో గ్రామాల్లో ఉపాధి హామీ పనుల కోసం గ్రామసభలను నిర్వహించిన అధికారులు అందుకు అనుగుణంగా పనిదినాలను ఖరారు చేశారు.

కేశంపేట: మండల పరిధిలో 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అన్ని గ్రామాల్లో ఉపాధి ప్రణాళికను ఖరారు చేసిన అధికారులు పనులు ప్రారంభించారు. మండలంలోని కూలీలకు 2025 ఆర్థిక సంవత్సరానికి గానూ 1.15లక్షల పనిదినాలను అధికారులు ఖరారు చేశారు. ఒక్కో గ్రామాన్ని యూనిట్‌గా ఎంచుకొని ఉపాధి పనులను నిర్వహిస్తున్నారు. కూలీలకు వేతనాలను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల సాఫ్ట్‌వేర్‌ను మార్చి కొత్తగా ఎన్‌ఐసీ(నేషనల్ ఇన్‌ఫర్మెటిక్ సెంటర్)ను వినియోగిస్తోంది. ఈ నూతన విధానం ద్వారా ఉపాధి పనులకు హాజరయ్యే కూలీల ఆధార్ నంబర్‌తో లింక్ ఉన్న బ్యాంక్‌ఖాతాకు కూలీల డబ్బులను జమచేస్తున్నారు.

వ్యవసాయ పనులకు ప్రాధాన్యం.

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో మొదటి ప్రాధాన్యతగా వ్యవసాయ పనులను అధికారులు గుర్తిస్తున్నారు. అందులో భాగంగా చెరువులు, నీటి కుంటలు, పంట కాలువలు, పూడికతీత పనులు, నీటి కుంటల నిర్మాణం, గుంతలు తీయడం, పంట పొలాలకు నూతనంగా రోడ్లు వేయడం లాంటి పనులు గుర్తించారు.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న అధికారులు

పనులు ప్రారంభం..

మండలంలోని 29 గ్రామాల పరిధిలో ఉపాధి హామీ పనులను అధికారులు కూలీలతో కలిసి ప్రారంభించారు. కూలీల కొరత లేకుండా ప్రతీ ఒక్కరికి ఉపాధి పనులను కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు. గ్రామాల్లో జాబ్ కార్డులు లేనివారు దరఖాస్తు చేసుకొని, ఉపాధి పనులకు రావాల్సి ఉంటుంది.

పనులు ప్రారంభించాం

మండంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులను ప్రారంభించాం. కూలీల సంఖ్యను పెంచి ప్రతీ ఒక్కరికి పనులు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. గ్రామాల్లో విస్తృతంగా ఉపాధి హామీపైన ప్రచారం నిర్వహించి, కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నాం.

– అజీజ్, ఏపీఓ, కేశంపేట మండలం

యువతకు ఛత్రపతి శివాజీ ఆదర్శం



ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ: ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని వీర్లపల్లి అనుబంధ గ్రామం చెర్లఅంతిరెడ్డిగూడలో గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆదివారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివాజీ మహారాజ్ హైందవ జాగృతికి, హిందువుల సంరక్షణకు ఎంతో కృషి చేశారన్నారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా ఆత్మగౌరవాన్ని కోల్పోలేదని, రాజులపై దండెత్తి హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించారన్నారు. ఛత్రపతి పోరాట పతిమను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చిందం నర్సింహా, చంద్రశేఖర్, రఘుగౌడ్, మంకాల శ్రీశైలం, పసుల బుచ్చయ్య, సీతారాం, నావాజ్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



విజేత జట్టుకు బహుమతి అందజేస్తున్న మాజీ సర్పంచ్ నవీన్

మాజీ సర్పంచ్ నవీన్

మొయినాబాద్: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని మేడిపల్లి మాజీ సర్పంచ్ నవీన్ అన్నారు. మండల పరిధిలోని మేడిపల్లిలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించిన ఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. స్పాన్సర్ కొత్తపల్లి సురేందర్ నిర్వహించిన టోర్నమెంట్‌లో శ్రీనివాస్ జట్టు విజేతగా నిలించింది. మహేశ్ జట్టు రన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. యువత తమ సమయాన్ని వృథా చేయకుండా క్రీడలకు కేటాయించాలన్నారు. క్రీడల్లో రాణించి ఉన్నత భవిష్యత్‌ను నిర్మించుకోవచ్చన్నారు. గ్రామాల్లో నిర్వహించే ఇలాంటి టోర్నమెంట్‌లను సద్వినియోగం చేసుకొని ప్రతిభను పెంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విజేతలకు ట్రోఫీతో పాటు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో క్రీడాకారులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్‌నాయక్

షాద్‌నగర్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్‌నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్సీ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాన్ని ఏఐఎస్ఎఫ్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో విద్యార్థులకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు మెనూ ప్రకారం, పౌష్టిక విలువలతో కూడిన భోజనాన్ని అందించాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌లో విద్యార్థులకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలని సూచించారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఏఐఎస్ఎఫ్ ఎల్లప్పుడూ ముందుంటుందన్నారు. విద్యార్థుల సమస్యలపై తాము రాజీలేని పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నరేశ్‌రాథోడ్, సాయి తదితరులు పాల్గొన్నారు.



హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఆధ్యాత్మికచింతన అలవర్చుకోవాలి

మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

కొందుర్గు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం గుంజల్‌పహాడ్‌లోని అభయాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం సీతారామచంద్రస్వామి, శివలింగం, నవగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువతలో భక్తిమార్గం పెంపొందేలా చూడాలన్నారు. సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. సనాతన ధర్మాన్ని పాటిస్తూ సమసమాజ స్థాపనకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఈట గణేశ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్, నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ విజయలక్ష్మి, నాయకులు

చేవెళ్ల: క్రీడాపోటీలు యువతకు నూతన ఉత్తేజాన్ని అందించడంతో పాటు వారిలోని ప్రతిభ వెలికితీయడానికి దోహదం చేస్తాయని మాజీ ఎంపీపీ విజయలక్ష్మిరమణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేవీఆర్ గ్రౌండ్‌లో ఆదివారం పర్మన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పి.దయాకర్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆమె స్థానిక నాయకులు, యువకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రామన్నగూడ గ్రామానికి చెందిన దివంగత జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పెద్దోళ్ల పర్మయ్య పేరుపై ఆయన కుమారుడు పెద్దోళ్ల దయాకర్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పేదలకు సాయం అందించటంతో పాటు టోర్నమెంట్‌లు నిర్వహించేందుకు ముందుకురావడం అభినందనీయమని కొనియాడారు. మండలంలోని యువత ఇలాంటి పోటీలను సద్వినియోగం చేసుకొని మండలం నుంచి జిల్లాస్థాయి వరకు ఎదగాలని కోరారు. ట్రస్ట్ చైర్మన్ దయాకర్ మాట్లాడుతూ.. మండలంలోని యువత కోసం ఈ పోటీలు ఏర్పాటు చేశామని, ఈ టోర్నమెంట్‌కు క్రీడాకారుల నుంచి భారీ స్పందన లభిస్తోందన్నారు. ఈ టోర్నమెంట్‌లో విజేత జట్టుకు రూ.50వేలు, రన్నరప్ జట్టుకు రూ.25వేలు అందించనున్నట్లు చెప్పారు. ప్రతి రోజు రెండు మ్యాచ్‌ల చొప్పున పోటీలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ దేవర వెంకట్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి, యువ నాయకులు డాక్టర్ వైభవ్‌రెడ్డి, పలువురు నాయకులు, యువత, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

మాజీ ఎంపీపీ విజయలక్ష్మి



విరాళం అందజేస్తున్న దాత వైభవ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల: దైవచింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత లభిస్తోందని మాజీ ఎంపీపీ ఎం.విజయలక్ష్మి అన్నారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలోని భువనేశ్వరి సహిత మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం శివస్వాముల మహాపడిపూజ ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో మండల బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి గాను బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి రూ.1లక్ష విరాళం ఆలయ కమిటీ సభ్యులకు విజయలక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో ఆలయాల నిర్మాణాలతోనే ప్రశాంత వాతావరణం నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అనంత్‌రెడ్డి, శర్వలింగం, ఆంజనేయులు, ఇంద్రసేనారెడ్డి, శ్రీకాంత్, శ్రీనివాస్, ప్రవీణ్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, జయసింహ, అఖిల్, సందీప్, ఆనంద్, శివారెడ్డి, రవీందర్‌రెడ్డి, గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

కందుకూరు: మండల పరిధిలోని పెద్దమ్మతండాలోని పెద్దమ్మతల్లి దేవాలయంలో ఆదివారం రెండోరోజు గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకుడు లచ్యానాయక్ ఆధ్వర్యంలో బ్రాహ్మణులు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. పూజల్లో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.కృష్ణనాయక్, మాజీ సర్పంచ్ సుమన్ నాయక్, నాయకులు రాములునాయక్, శంకర్ నాయక్, రవినాయక్, లక్ష్మణ్‌నాయక్, వర్ష, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతోనే శాశ్వత పరిష్కారం



సమావేశంలో పాల్గొన్న శివశంకర్ మాదిగ తదితరులు

ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి శివశంకర్‌మాదిగ

చేవెళ్ల: ఎస్సీ వర్గీకరణతోనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి, చేవెళ్ల ఇన్‌చార్జి శివశంకర్‌మాదిగ అన్నారు. చేవెళ్లలో ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరంలో ఈ నెల 24(సోమవారం)న నిర్వహించే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం పెద్దఎత్తున విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 7న జరగాల్సిన లక్ష డప్పులు– వేల గొంతుల సాంస్కృతిక ఉద్యమం తాత్కాలికంగా వాయిదా పడిందని, ఈ మేరకు నగరంలో నిర్వహించే రాష్ట్ర సమావేశంలో భవిష్యత్ కార్యచరణను ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఎస్సీ వర్గీకరణ కోసం ప్రభుత్వం నియమించిన షమీమ్ అక్తర్ కమిషన్ ప్రభుత్వానికి ఇచ్చిన నివేదిక తప్పుల తడకగా ఉందని శాస్త్రీయంగా విచారణ జరపలేదన్నారు. మాదిగలకు ఖచ్చితంగా 11శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనని, లేదంటే ఈ ప్రభుత్వాన్ని మాదిగలు ఎండగడుతారన్నారు. మాదిగల ఆత్మగౌరవం నిలబెట్టుకునేందుకు ఎస్సీ వర్గీకరణ పక్కగా జరగాల్సిందేనని, దీనికి అందరూ ఐక్యంగా కలిసి పోరాడాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఈదులపల్లి రాములు, వెంకటేశ్, మహేందర్, మల్లేశ్, చందు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షురాలిగా స్వరూప



స్వరూపకు నియామకపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షురాలు జ్యోతి

షాబాద్: షాబాద్ మండల మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా పి.స్వరూపను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షురాలు పామెన జ్యోతి భీంభరత్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కుర్వగూడలో నిర్వహించిన సమావేశంలో గ్రామానికి చెందిన పి.స్వరూపను మండల మహిళా అధ్యక్షులిగా నియమించి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. మహిళల సాధికారత కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. దశలవారీగా ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామన్నారు. ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. పార్టీ బలోపేతానికి కాంగ్రెస్ కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ నాయకురాలు తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

టోర్నమెంట్ నిర్వాహకుడు రాజు

షాబాద్: క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని టోర్నమెంట్ నిర్వాహకుడు సబ్బరిగారి రాజు పేర్కొన్నారు. మండల పరిధిలోని బోడంపహాడ్ గ్రామంలో గ్రామస్థాయి క్రికెట్ పోటీలను నెలరోజులుగా నిర్వహించారు. ఆదివారం విజేతలుగా నిలిచిన బీపీడీ నైట్ రైడర్స్ జట్టుకు రూ.10వేల నగదు, బీపీడీ రాయల్ ఛాలెంజర్స్ జట్టుకు రెండో బహుమతి రూ.5వేల నగదు, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌కు రూ.2500 నగదుతో పాటు ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన రాజు మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులకు ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయన్నారు. క్రీడలతో మానసిక ఉల్లాసం, సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఓటమి గెలుపునకు నాంది కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బాలకిష్టయ్య, గ్రామస్తులు ఇనాయత్, చెన్న రాములు, శేఖర్, అంజయ్య, శివయ్య, అంతయ్య, క్రీడాకారులు తదితరులు ఉన్నారు.



గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకుడు రాజు

ఘనంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, భక్తులు

ఉత్సవంలో భారీగా పాల్గొన్న నాయకులు, భక్తులు

షాద్‌నగర్‌రూరల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఫరూఖ్‌నగర్ మండలం రామేశ్వరంలోని ఉత్తర రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం పార్వతీపరమేశ్వరుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దేవాలయ ఆవరణలో అర్చకుల వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో జరిపించారు. ఈ మహోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొని పరమశివుడికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచనకృష్ణారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బక్కన్నయాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు ఆశన్నగౌడ్, సంపత్‌కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అరుణావెంకట్‌రెడ్డి, నాయకులు రఘునాయక్, బస్వం, మోహన్‌రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, రాయికల్ శ్రీనివాస్, ఎండీ. ఇబ్రహీం, బాల్‌రాజ్‌గౌడ్, పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్, మురళీమోహన్, నెహ్రూనాయక్, అశోక్, మల్లేశ్‌గౌడ్, గామపెద్దలు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.